# చాక్‌లైట్

"దీప చిన్నారి మనసులో ఎన్నాళ్ళుగానో ఉన్న కోరిక ఫలించింది. తీయని అందమైన చాక్‌లైట్ తనకు కావాలన్న దీప కోరిక వేయింతలుగా ఫలవంతమైంది. చాక్‌లైట్. ఒక్క ఛాక్‌లైట్ కోరుకుంటున్న దీపకు లెక్కపెట్టలేనన్ని ఛాక్‌లైట్లు. దీప కుర్చీలో కూర్చుంది ఎదురుగా టేబిలుపైన రంగు రంగుల ముచ్చి కాగితాలలో చాక్‌లైట్లు చూస్తుంటే దీప కళ్ళు జిగేలు మంటున్నాయి అవన్నీ తనకే. తనకోసమే. ఇంకెవరికీకాదు. గోపి, రాణి, శైలూ ఎవరికీ ఇన్ని చాక్‌లైట్లులేవు. తాను ఎన్ని తిన్నా ఈ చాక్‌లైట్లు అయిపోవు. ఒక్క చాక్‌లైటు కావాలని ఎన్నాళ్ళగానో అనుకున్న తనకు ఇప్పుడు ఎన్ని చాక్‌లైట్లో!!! చెయ్యి జాచి టేబిలుపైన చాక్‌లైట్లు అందుకోబోయింది దీప ఆ చిన్నారి చేతికి చాక్‌లైట్లు అందలేదు. కొద్దిగా దీపకూర్చున్న కుర్చీ టేబిలుకు దూరంగా ఉంది. ఒక్కసారి చెంగున టేబిలు పైకి దూకి చాక్‌లైట్లు తీసుకోబోయింది దీప. నిద్రపోతున్న వాళ్ళనందరినీ కలవర బెట్టేలా పెద్ద శబ్దం. అనుశ్రుతంగా దీప ఏడుపు. మంచమీదనుంచి క్రింద పడిపోయింది. దురదృష్టవంతులకు కలలోకూడా తృప్తిగా వాళ్ళు కోరుకున్న కోరికలు తీరవు. అందుకే దీప కమ్మని కల చాక్‌లైట్లు నోటికి అందేలోగానే చెదరిపోయింది. ఆకలకు ఫలితంగా మంచం మీదనుంచి క్రింద పడి తల

బొడిపె కట్టింది మంచం మీదనుంచి క్రిందపడ్డందుకు, తలబొప్పికట్టి నందుకు తెల్లవారకుండానే ఏడుపు ప్రారంభించిందని అత్తయ్య నాలుగు దెబ్బలు వేసినందుకు ఏడుపు రావడంలేదు దీపకు. తను కోరుకున్న చాక్లైట్లు కలలో నైనా అందుకో లేకపోయినందుకే దీపకు ఏడుపు వస్తోంది.

అత్తయ్య కాఫీకి పిలిచిన సంగతి గమనించలేదు దీప. కల కరిగిపోయి గంట దాటిపోయినా, కలలో చాక్లైట్లు దీప కళ్ళలో మెదులుతున్నాయి.

"చెల్లాయీ! అత్తయ్య పిలుస్తోంది. కాఫీ తాగుదాము పద. సాయంత్రం స్కూలునుంచి వచ్చేటప్పుడు నీకు చాక్లైట్లు తెస్తాలే" అన్నాడు. ఒక్కక్షణం దీప మనస్సులో మళ్ళీ తీయని ఆశ చోటు చేసుకుంది. దానికి ప్రతిరూపంగా ఆ పాపాయి ముఖంలోని ఆ చిరునవ్వు చూడాలని అన్నాడు రవి, కాని సాయంత్రం తను చెల్లాయికి చాక్లేట్లు తెచ్చి పెట్టలేడని తెలియక కాదు.

దీప చిరునవ్వు చూడలేకపోతే రవిస్కూలులో పాఠాలు వినలేడు. ఇంటి దగ్గర అత్తయ్య మావయ్య చెప్పిన పనులు సరిగా చెయ్యలేడు. అందుకే దీపను ఆనంద పెట్టడానికి అలా అన్నాడు. ఇలా అనటం ఈఒకసారికే కాదు. ఇంతకు ముందు ఎన్నో సార్లు దీప ఏడుస్తున్నప్పుడు అంటూ ఉన్న మాటలే ఇవి. పసిపిల్ల లందరికీ చాక్లేట్లు తినాలనే కోరిక సామాన్యమే! కాని దీపకు అదే, అదే అసామాన్య కోరికగా

మిగిలిపోయింది. రవికి చాక్‌లేట్లు తినాలని కోరిక లేకపోయి నా దీపకు తినిపించాలన్న కోరిక కోసం తనకూ చాక్‌లేట్లు కావాలని ఉంది. ప్రతీ షాపులోనూ ఎన్నెన్నో చాక్‌లేట్లు ఉంటాయి. కాని అవి చేతిలోకి రావాలంటే కనీసం పది పైసలన్నా వుండాలి. రవి దగ్గర ఎప్పుడూ పది పైసలు తనవిగా మిగలలేదు. అసలు మరి. రవి దగ్గర పైసలు ఉండ-టానికి అయినా దీప కోరుకున్న చాక్‌లేట్లు తినటానికైనా అనురాగంతో గారాబంచేసే అమ్మా నాన్నలు ఉండాలిగా మరి అమ్మా నాన్నలను పోగొట్టుకున్న దౌర్భాగ్యులైన రవి, దీపలకు చాకలేటు, పది పైసలు కూడా తీరని కోరికలు కావటం ఆశ్చర్యం కాదుగా!

అత్తయ్య, మావయ్య ఆదరణలో పెరుగుతున్న ఆ పసి హృదయాలు ప్రతీ క్షణం సుడిగాలికి గడగడ వణికిపోయే చిగురుటాకులులాగ చెదరిపోతూనే ఉంటాయి. రవి వయస్సు పది ఏళ్ళేఅయినా మనస్సు అంతకు మరో అంత ఎదిగిపోయింది. పగలంతా అత్తయ్య చెప్పే పనులుచేసి ప్రతిదానికి అత్తయ్య చూపించే విసుగు, పుట్టే చీవాట్లు భరిస్తూ, ఆమె కనికరించి నప్పుడు స్కూలులో చదువుకొని, రాత్రి చెల్లాయిని హృద-యంలో దాచుకొని నిద్రపోతాడు. తనతోటి వాడే అయిన గోపి ఇంట్లో ఒక్క పనికూడ చెయ్యడు. రోజంతా ఆటు-లతో గడిపిన తననోట్సులు కూడా రవి చేతనే రాయించు కుంటాడు. రాణి, శైలూ రకరకాల ఆటబొమ్మలతో ఆడు-కుంటూ ఇష్టమొచ్చినన్ని చాక్‌లేటు, బిస్కెట్లు తింటూ చుట్టుపక్కల ఇళ్ళలోని పిల్లలతో ఎంతో సరదాగా కబుర్లు

చెపుతూ అమ్మ ముద్దులతోనూ నాన్నారి మురిపేలతోనూ కాలం హాయిగా గడిపేస్తారు. దీపను దగ్గఱకు చేరనివ్వరు. వాళ్ళకున్నని మంచి గౌనులు, రకరకాల బొమ్మలు తనకూ కావాలని దీప ఎప్పుడూ అడగలేదు. కాని వాళ్లు చాక్‌లేటు తింటున్నప్పుడు తనకూ కావాలని అడగకుండా ఉండనూలేదు ఒక్కసారి అయినా దీప కోరిక తీరితుంటే అచిన్నారి మనస్సుకు ఇంత బాధ ఉండేదికాదు. "అన్నం పెడుతున్నది చాలక నీమొహానికి చాక్‌లేటు కూడానా ? ఇవేళ నా పిల్లతో సరిగా చాకలేట్లు ఇవ్వడము మొదలెడితే రేపు పెద్దయ్యాక వాళ్ళతో సరిగా చదువులు చెప్పించమనీ, మంచి మంచి బట్ట లని కొనివ్వమనీ నెత్తిక్కి కుర్చుంటావ్" అని అత్తయ్య కసిరికొడితె దీపకు అర్థమయింది ఒకటే. అత్తయ్య తనకు చాకలేటు ఇవ్వమంటే ఎందుకో కోప్పడుతుందని, అందుకే మరి ఎప్పుడూ అత్తయ్యని చాక్‌లేటు అడగకూడదని అను కుంటుంది. కాని రాణి, శైలూ తింటూ ఉంటే చూస్తూ ఊరుకో లేక అడగకుండా ఉండలేకపోతోంది అడుగుతుంది. అడిగి-నప్పుడల్లా అత్త ఇచ్చేది దీప తినేవి చాక్‌లేట్లు కాదు. అత్తయ్యచేత ఆరోజంతా చీవాట్లు. అప్పుడప్పుడు దెబ్బలు."

అన్నయ్యతో కలిసి కాఫీత్రాగిన దీప తనకోసం కల లోకి వచ్చిన చాక్‌లేట్లను మరచిపోలేదు. మరచిపోలేక పోతోంది. ఎందుకోమరి. తలమీద బొడిపొకటి ! వుండుండి మరచిపోయినా గుర్తుకు తెస్తోంది. పాడు దెబ్బ ఎందుకు తగలాలి ? జ్ఞాపకంచేసి మరింత మనసుబాధకా ! ఎందుకో ఇలా ? అందుకే ఆరోజు రవిస్కూలుకి వెళుతున్నప్పుడు

తప్పకుండా చాక్ లేటు తీసుకురమ్మని మరీ మరీ చెప్పింది. ఆచెప్పటం తనకు చాకలైటు తప్పక తెచ్చిపెట్టవలసిందే అని శాసిస్తున్నట్టుగాని చాక్లైటు ఇవ్వకపోతే అన్నం తిననని "అ ఆ"లు దిద్దనని, నీకు ముద్దివ్వనని గారాలతో మారాం చేస్తున్నట్లు కాని కాదు. ఎన్నాళ్ళగానో తనకు తినాలని ఉన్న చాక్ లేటు ఈరోజు అయినా తెచ్చిపెట్టమని అతి దీనంగా ముఖం అదోలా పెట్టి బ్రతిమాలినట్లు చెప్పింది. అందుకే రవి, స్కూలులో పాఠం చెప్తున్నా, ఇదివరకటిలా మరచిపోలేక పోతున్నాడు. మాష్టారు ఏమి చెప్పున్నదీ అర్థం కావడంలేదు రవికి. చాక్ లేటు తెచ్చిపెట్టమని దీప మరీ మరీ చెపుతున్నపుడు ఆచిన్నారి కళ్ళలోని దైన్యాతి దైన్యమే రవికి కనిపిస్తోంది. తప్పక చాక్ లైటు కావాలన్న చెల్లాయి మాటతప్ప రవి మనస్సుకు ఇంకేమీ వినిపించ-డములేదు

ఇవేళ ఎలాగైనా చెల్లాయికి చాక్ లేటు తీసుకోని వెళ్ళందే సాయంత్రం ఇంటికి వెళ్ళకూడదు. ఇవేళ ఎలాగైనా చెల్లాయికి చాక్ లేట్లు ఇచ్చితీరాలి. ఎందుకో ఆశగా ఒక్కసారి జేబులో చెయ్యిపెట్టి చూసేడు. కాని తను దాచుకోని పైసలు జేబులోకి ఎలాగవస్తాయి ! తన పిచ్చి ఆలోచనకు తనలోనే తాను నవ్వుకున్నాడు. తనకు కనీసం మావయ్యను పదిపైసలైనా అడిగే ధైర్యంలేదు. అత్తయ్య సామాన్లు తీసుకు రమ్మనమని ఇచ్చిన డబ్బులు ఏమాత్రం మిగిలినా సామాన్లతో పాటు వాటినికూడా నయాపైసలతో సహా ఇచ్చేస్తాడు. మరి తన దగ్గఱ డబ్బు ఎలా వుంటుంది ? ఎలా వస్తుంది ?

"ఏమిటాl ! ఆలోచిస్తున్నావ్ !" స్నేహితుడు రాముం మాటకు తుళుక్కుపడి ఈలోకంలోకి వచ్చేడు రవి. " ఏం లేదురా " అనేసేడు మామూలు ధోరణిలో.

ఇంటర్వెల్ టైంలో రాము రవికి ఏవేవో కబుర్లు చెబుతున్నాడు అవేవీ సరిగ్గా వినిపించక పోయినా, "ఊఁ" కొడుతున్నాడు రవి. ఒక్కసారిగా ఏదో గుర్తువచ్చిన వాడిలా "ఒరే ! రవీ ! నాపుస్తకాలు చూస్తూ ఉండరా ! ఇప్పుడే వచ్చేస్తా " అంటూ తన పుస్తకాల సంచి రవికి అప్పచెప్పి బయటికి వెళ్ళేడు రాము.

అప్రియత్నంగానే ఆసంచిలోని పుస్తకాలను బయటికి తీసి తిరగవేస్తున్నాడు, రవి. ఓ పుస్తకం మధ్యలో రవి చూపులు నిలచిపోయేయి. తను కోరుకుంటూన్న నిధి దానిలో రవికి కనిపిస్తోంది. "అది నిజంగా తనదే అయితే ఎంత బాగుండును ? చెల్లాయికి తప్పక చాక్‌లేటు కొని పెట్టకలిగి ఉండేవాడు. అయినా అది తనదికాదు. తనదెలా గవుతుంది ? అవదు. పోనీ ! రాము రానీ అడుగుతా ! అడిగితే ఎందుకిస్తాడు ? ఇవ్వడు. పైగా ఏమంటాడోకూడా. అయినా ఈ ఆలవన లెందుకు ? ఎలాగైనా ఈరోజు తనకు పదిపైసలు కావాలి. తన దగ్గఱలేదు. రాము పుస్తకంలోని పదిపైసల నాణెం తనది కాదు! ఎందుకు కాదు?రాము ఇక్కడలేడుగా ! తను తీసుకుంటే తనదే అవుతుంది. డబ్బులకి తను ఎవరి దాన్నో చెప్పడం రాదుగా ! తన దగ్గఱఉంటే అది తనదే అవుతుంది. చెల్లాయి కోరికా తీరుతుంది ఇంకా ఆలశ్యం చేస్తే రాము వచ్చేస్తాడు."

రవి మామూలుగానే రాము సంచిలో పుస్తకాలు పెట్టేసాడు. అంతవఱకు ఆపుస్తకాలమధ్య ఉన్న పదిపైసలు బిళ్ళ ఇప్పుడు రవి జేబులోవుంది. తను కోరుకున్న పది పైసలు తనదే అయిపోయింది. కాని ఇంటర్ వెల్ తర్వాత కూడా క్లాసులో రవి సరిగ్గా పాఠాలు వినలేక పోతున్నాడు. ఈ పది పైసలు తనకు ఎక్కడిది ? తనకు ఎలా వచ్చింది ? ఈ ఆలోచనలతో సతమత మవుతున్నాడు. ఎవరో ప్రేమతో ఇచ్చింది. కాదు పోనీ ఏ రోడ్డుపైనా అన్నా దొరికిందికాదు. తనో దొంగతనం చేసాడు. క్షమింపరానిది. ఆమాట ఆపసి-వాడి మనస్సును కలవర పెడుతోంది.

హృదయంలో చీకటి కమ్ముకుంది. దొంగతనం చెయ్యడం తప్పని, ఒకరిసొమ్ము మరొకరు దోచుకోడం నేరమని రవికి తెల్సు. అందుకే అతిసామాన్య మైన పది పైసల నాణెం అతనికి మోయరాని బరుగావుంది. పోనీ విషయం చెప్పి రామూకు ఇచ్చేస్తే ! అప్పుడు తను తప్పు చేసినట్లు కాదు. ఈ ఊహ రవి మపస్సులో ఎంతోసేపు స్థానం చేసికోలేదు. ఎందుకంటే పది పైసలు రాముకిచ్చేస్తే తను చెల్లాయికి చేక్ లేటు కొని పెట్టడం ఎలా ?

స్కూలు విడిచిపెట్టగానే రవి తనజేబులో పదిపైసలను చాక్ లేటుగా మార్చేసాడు. అయినా దొంగతనం చేసేనన్న బాధ క్షణక్షణం ఆ పసిహృదయాన్ని కలచివేస్తోంది. ఇంటికి చేరుకున్నాడు. నిద్రపోతున్న చెల్లాయిని లేపి చాక్ లేటు అందించేడు. హఠాత్తుగా లాటరీలో లక్షరూపాయిలు లభించిన

వ్యక్తికి, కట్నం ఇవ్వలేక కూతురిపెళ్ళి చెయ్యలేని తండ్రికి ఆదర్శ వంతుడైన యువకుడు కట్నమే లేకుండ తన కూతురిని వివాహం చేసికుంటానంటే కలిగే అంత సంతోషము కన్న మరో పదిరెట్లు ఎక్కువగానే, నిజానికి మాటలతో వర్ణించలేనంత సంతోషం చాక్లేటును చూసి నప్పుడు కలిగింది దీపకు. మళ్ళీ తనది కాకుండా పోతుందే మోనని. చాక్లేటును గట్టిగా పట్టేసికుంది.

తనకు చాక్లేటును తెచ్చిపెట్టినందుకు అన్నయ్యను ఎన్నోఎన్నెన్నో ముద్దులు పెట్టేసుకుంది. చెల్లాయి ఆనందం చూస్తూఉంటే రవి మనస్సులో ఇంతవరకూ ఉన్నకలత గాలికి చెదరిపోయే మేఘంలా పటాపంచలై పోయింది. చెల్లాయిని తీసుకొని అలా చల్లగాలిలో ఆటల మైదానంలో కూర్చున్నాడు. ఎంతో కాలానికి తీరిన తనకోరిక. చాక్లేటు చేతిలోనే వుంది. దాన్ని మనసారా చూస్తూ మురిసిపోతోంది. "చెల్లాయి ! చాక్లేటు తినుమరి ! ఎంత తియ్యగా వుంటుదో మరి?" అన్నాడు రవి. చాక్లేటు చేతులలో వున్నందుకే ఇంత మురిసిపోతూన్న దీప ఆ చాక్లేటు తిని ఎగిరి గంతులేస్తుంటే చూడాలని వుంది రవికి. కాని రవి చెప్పినట్టుగా చాక్లేటు తినేయకుండా దీప అడిగిన ప్రశ్నలకు ఉలిక్కి పడ్డాడు.

తన మనస్సులోంచి చెదిరిన కలతల కారుమబ్బు మళ్ళీ అలుముకుంది. ఆమబ్బు వర్షించిన వర్షమో ఏమో అతని కళ్ళలోంచి ధారలు ధారలుగా కన్నీటి రూపాన్న కురుస్తోంది.

దీప కంపించిపోయింది.

"ఏడుస్తున్నావా ? అన్నయ్యా ! నీకు చాక్‌లేటు కావాలా ? పోనీ ! నాకు వద్దులే ! నువ్వే తిను అన్నయ్యా !"

రవి చేతికి చాక్‌లేటు అదదించ బోయింవి దీప.

రవి ఏమీ పలకలలేక పోయేడు.

కాని చెయ్యి వెనుకకు లాగేసుకున్నాడు.

తన మనస్సును ఇంతవఅకూ కలవర పెడుతున్న విషయం, అదే, అదే రాము దగ్గఅ ఛాక్‌లేటు కోసం పది పైసలు దొంగిలించిన విషయం వెక్కి వెక్కి ఏడుస్తూనే కాస్సేపటి తరువాత దీపకు చెప్పేసేడు.

"దొంగతనం చెయ్యడం తప్పుగా! అన్నయ్యా ! మరి ఎందుకలా చేసేవు" అమాయంగా ప్రిశ్నంచింది దీప.

"తప్పు చెయటం నాకూ ఇష్టంలేదు చెల్లాయి. మరి నువ్వు చాక్‌లేటు అడిగావుగా ! ఒక్కసారైనా నీకు చాక్‌లైటు కొనిపెట్టాలని పించింది" అంతకన్నా అమా-యకంగా వుంది రవి జబాబు.

నాకు చాక్‌లేటు వద్దులే అన్నయ్యా! మరి ఎప్పుడూ ఇలాచెయ్యోద్దు"

దీప కళ్ళల్లో నీళ్ళు నిలచాయి.

"నిజమే ! చెల్లాయి ! ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చేయను. నేను పెద్ద చదువు చదివి బోలెడు డబ్బులు సంపాదించి నీకు చాక్లేట్లు కొని పెడతాన" న్నాడు రవి.

ఆ పసివాళ్ళిద్దటి చేతులు ఒకరి చేతులు మరొకరి కన్నీళ్ళను నెమ్మదిగా తుడిచేయి. ఒకరి చేతిని మరొకరు పట్టుకోని నెమ్మదిగా ఇంటివైపు నడిచేరు.

దీప చేతులోంచి ఎప్పుడో జారిపడిన చాక్లేటు అక్కడే మిగిలి పోయింది ఆమైదానంలో.

రవి చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నప్పుడు దీపకు కావలసింది చాక్లేటు కాదని, ఇప్పుడు పసిపావగా ఉన్న దీప తనతోనే ఎదిగిపోతుందని తెలియని అమాయకపు రవిని చూస్తూఉంటే చాక్లేటుకు జాలేసింది.

కలలోనే కాదు. చేతికందినా దీప, తనను పొందలేకపోయినందుకు 'చాక్లేటు' భారంగా నిట్టూర్చింది. తనకోసం ప్రారంభమైన రవి బ్రతుకు దొంగతనపు చీకటి అలముకోకుండా ఆ పసివాళ్ళు విషయాన్ని గ్రహించి తనని దూరంగా విసరి పారేసి నందుకు చాక్లేటు సంతోషించింది.

"యువరాణి"
విశాఖపట్నం కేంద్రం
ఆకాశవాణి ప్రసారం.